ఈవీఎంలలో భవితవ్యం

- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- 3న ఫలితాలు..అభ్యర్థుల్లో ఉత్కంఠ

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): చెదురుమదురు ఘటనలు మినహా తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన 2,290 మంది అభ్యర్థుల భవితవ్యం ఈనెల 3న తేలిపోనుంది. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు మధ్యాహ్నానికి గెలుపోటములపై స్పష్టత రానుండగా, సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈసారి అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోరు హోరాహోరీగా సాగటంతో ఓటరు తీర్పు ఎలా ఉండబోతుందన్న దానిపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకే ముగియగా, అప్పటి వరకు క్యూలో ఉన్న వారిని కూడా అనుమతించటంతో కొన్నిచోట్ల పొద్దుపోయే వరకు పోలింగ్ కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, సుమారు రెండున్నర లక్షలమంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను బరిలోకి దింపగా, ఈసారి స్వతంత్రులు కూడా భారీగానే రంగంలోకి దిగారు.

లెక్కింపునకు ఏర్పాట్లు

3న జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. మొత్తం 49 ప్రాంతాల్లో లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసింది.119 నియోజకవర్గాలకు గాను 119 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న పది నియోజకవర్గాలు మినహా ఒక్కో నియోజకవర్గంలో 14+1 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కూకట్పల్లి, ఉప్పల్, మల్కాజ్‌గిరి, పటాన్‌చెరు తదితర నాలుగు నియోజకవర్గాల్లో 400లకుపైగా పోలింగ్ కేంద్రాలు ఉండటంతో ఈ నియోజకవర్గాల్లో 20+1 టేబుళ్లు.. రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, కూకట్‌పల్లి, మేడ్చల్ తదితర ఆరు నియోజకవర్గాల్లో 500లకుపైగా పోలింగ్ కేంద్రాలు ఉండటంతో 28+1 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. లెక్కింపులో జాప్యం జరగకుండా ఉండేందుకే ఈ ఏర్పాట్లు. తెలంగాణ శాసనసభ ఎన్నికలకు నవంబర్ 3న షెడ్యూల్ విడుదల కాగా, 28న ప్రచారానికి తెరపడింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇవి మూడో ఎన్నికలు. గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అద్వితీయ మెజార్టీతో విజయం సాధించింది. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ నమోదు చేస్తామన్న ధీమాతో ఉంది.

ఫలితాలపై ఉత్కంఠ

ఎన్నికల ఫలితాలపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులతోపాటు ప్రజల్లోనూ తీరని ఉత్కంఠ నెలకొన్నది. గతంలో వచ్చిన సర్వేలు, పోలింగ్ ముగిసిన తర్వాత వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాల మధ్య పొంతన లేకుండా ఉండటంతో ఫలితాలు ఎలా ఉంటాయన్న దానిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. చాలా నియోజకవర్గాల్లో అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ద్విముఖ పోటీ నెలకొనగా, కొన్నిచోట్ల బీజేపీ కూడా బలంగా ఉండటంతో త్రిముఖ పోటీ ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాత్రం వేటి కవే గెలుపుపై ధీమాగా ఉన్నాయి.



ఆజంపురలో ఓటు హక్కు వినియోగించుకున్న హోంమంత్రి మహమూద్‌అలీ

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండాలో ఓటు వేసిన మంత్రి సత్యవతి

పోస్టల్ బ్యాలెట్ల కోసం ప్రత్యేక టేబుళ్లు

> ఈసారి పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. 500 ఓట్లకు ఒకటి చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈవీఎంల కౌంటింగ్ పూర్తయ్యేలోపు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తిచేయాలని నిర్ణయించారు. ఒకవేళ ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలోగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తికాకుంటే, చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపును నిలిపేసి పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాతే చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపు చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈసారి 119 నియోజకవర్గాలకుగాను దాదాపు రెండున్నర లక్షల పోస్టల్ బ్యాలెట్లు జారీచేశారు.

ఓట్ల లెక్కింపు వివరాలు

నియోజకవర్గాలు	119
లెక్కింపు కేంద్రాలు	119
లెక్కింపు జరిగే ప్రాంతాలు	49
ఒక్కో లెక్కింపు కేంద్రంలో టేబుళ్లు	14+1
పోటీలో ఉన్న అభ్యర్థులు	2,290
పోలింగ్ జరిగిన కేంద్రాలు	35,655

లెక్కింపు తేదీ- 3వ తేదీ
ఉదయం 8 గంటల నుంచి

గురువారం బంజారాహిల్స్ నందినగర్‌లోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాల్‌లో సతీమణి శైలిమతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి కేటీఆర్

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బస్టాండ్ కాలనీ సమీపంలో గల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ సంతోష్‌కుమార్ దంపతులు

హైదరాబాద్‌లోని రాంనగర్ పోలింగ్ కేంద్రంలో తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వేలిని చూపుతున్న యువతులు నిహారిక, నితిక

సిద్దిపేట భారత్‌నగర్ అంబిటస్ స్కూల్‌లోని మాడల్ పోలింగ్ బూత్‌లో కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి హరీశ్‌రావు

కరీంనగర్‌లోని క్రిస్టియన్ కాలనీలో ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు

తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక (డి.సి.యం.) శాఖ

పత్రికా అధికార వార్త

తేది: 01-12-2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక శాఖ నోటిఫికేషన్ నెం. 220 (ఎల్)/డి.సి.యం. 111/2013 తేది: 27-12-2013 ప్రకారం జారీ అయిన 9.38% శాతం ఆంధ్రప్రదేశ్ యస్.డి.ఎల్.2023ను తేది:31-12-2023 వరకు అయిన వడ్డీతో 01-01-2024న తిరిగి చెల్లించడమవుతుందని సమాచారార్థం ప్రకటించడమయింది. (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తరువాత తెలంగాణకు వర్తిస్తుంది) ఒకవేళ, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం, పైన పేర్కొన్న సదరు తేదీని నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం 1881 క్రింద సెలవు దినంగా ప్రకటించిన పక్షంలో, రుణాన్ని ఆ రోజుకు ముందు పని రోజున, రాష్ట్రంలోని చెల్లింపు కార్యాలయాలు చెల్లిస్తాయి. 01-01-2024 తేది నుండి ఆపైన రుణంపై ఎటువంటి వడ్డీ వుండదు.

2. 2007, ప్రభుత్వ అన్యాక్రాంత హమీ పత్రచట్టం రక్షణ నిబంధనలలోని 24(2), 24(3)ఉప నిబంధన ప్రకారం, సబ్సిడరీ జనరల్ లెడ్జర్ లేదా కానిస్టిట్యూట్ సబ్సిడరీ జనరల్ లెడ్జర్ అకౌంట్ లేదా స్టాక్ సర్టిఫికేట్ రూపంలో ప్రభుత్వ సెక్యూరిటీని కలిగివున్న రిజిస్టర్డు హోల్డరుకు పరిపక్వ మొత్తాల చెల్లింపును అతని బ్యాంకు సంబంధ వివరాలను చేర్చుతూ పే ఆర్డరు ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నిధులను అందుకునే సదుపాయం కలిగివున్న ఏదేని బ్యాంక్‌లో అకౌంటు హోల్డరు ఖాతాకు జమ చేయడం ద్వారా గాని చేయాలి. సెక్యూరిటీలకు సంబంధించి చెల్లింపు చేసే కార్యం కోసం అట్టి ప్రభుత్వ సెక్యూరిటీల ఒరిజినల్ సబ్‌స్క్రైబరు లేదా తరువాతి హోల్డర్లు ఆయా సందర్భాన్ని బట్టి వడ్డీ చెల్లింపు కోసం వారి బ్యాంకు ఖాతా వివరాల కోసం సంబంధించిన వారు వ్రాయించుకున్న/నమోదు చేసుకున్న బ్యాంకు లేదా ట్రెజరీ/సబ్ ట్రెజరీ లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దాని అనుబంధ బ్యాంకులకు ఆయా సందర్భాన్ని బట్టి సమర్పించాలి.

3. ఏమైనప్పటికి బ్యాంకు ఖాతా సంబంధ వివరాలు లేనప్పుడు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నిధులను తీసుకోవడం తప్పనిసరికానప్పుడు 9.38% శాతం ఆంధ్రప్రదేశ్ యస్.డి.ఎల్.2023 హోల్డర్లకు గడువు తేదీన తిరిగి చెల్లింపును చేయడానికిగాను, వారి సెక్యూరిటీలను పబ్లిక్ ఋణ కార్యాలయంలో 20 రోజుల ముందుగా అందజేయాలి. సెక్యూరిటీల వెనుక వైపున ఈ క్రింది విధంగా వ్రాసి తిరిగి చెల్లింపు కోసం సెక్యూరిటీలను సమర్పించాలి.

"ధృవపత్రాలపై రావలసిన అసలు మొత్తం అందింది"

4. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దానికి చెందిన ఏవైనా అనుబంధ బ్యాంకులు ట్రెజరీ పనిని నిర్వహించే చోట్ల, సెక్యూరిటీలు స్టాకు సర్టిఫికెట్ల రూపంలో ఉన్నట్లయితే, వాటిని సంబంధిత బ్యాంకు బ్రాంచిలో సమర్పించాలి. ట్రెజరీలో లేదా సబ్-ట్రెజరీలో కాదని ముఖ్యంగా గమనించాలి.

5. చెల్లింపు కోసం సెక్యూరిటీలను వ్రాయించుకున్న చోట కాకుండా ఇతర చోట్ల చెల్లింపు తీసుకోవాలని కోరుకునే వారు వాటి వెనుక వైపు వ్రాసి, రిజిస్టరు చేసిన, భీమా చేసిన పోస్టు ద్వారా సంబంధిత ప్రజారుణం కార్యాలయానికి వాటిని పంపించాలి. ప్రజారుణ కార్యాలయం ఏదైనా ట్రెజరీ/సబ్ ట్రెజరీ లేదా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ట్రెజరీ పనిని నిర్వహించే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దాని అనుబంధ బ్యాంకులలో చెల్లించదగే డ్రాఫ్టును జారీ చేయడం ద్వారా చెల్లింపులు చేస్తుంది.

కె. రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ

DIPR RO. No. 2174-DP/CL/Advt/1/2023-24, Dt: 28-11-2023

ప్రజల ఆశీర్వాదం మాకే

- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ కొత్త చరిత్ర సృష్టిస్తారు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల ఆశీర్వాదం తమకే ఉన్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఇప్పటికే తెలంగాణను సాధించి రికార్డు సృష్టించిన సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా మరో చరిత్ర సృష్టించబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో మంచి వాళ్లు ఉండాలని, మంచి చేసినోళ్లే ఉండాలని గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు భావించారని పేర్కొన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లో ఉన్న పెద్దమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పింక్ వేవ్ వచ్చిందని చెప్పారు. పింక్ వేవ్ స్పందన చూస్తే తమను ప్రజలు పెద్దఎత్తున ఆశీర్వదించి చరిత్ర సృష్టించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హెడ్‌ఆఫీస్ నుంచి చాలా ప్రోత్సాహం లభించిందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు.

నిండు గర్భిణి.. చాటింది ఓటు ఖ్యాతిని

ఓ నిండు గర్భిణి.. పురిటినొప్పులు భరిస్తూనే ఓటేసి ప్రజాస్వామ్య దేశంలో ఓటుకున్న ఖ్యాతిని చాటిచెప్పింది. తన ఓటు వృథా కాకూడదన్న సంకల్పంతో ఓటు హక్కు వినియోగించుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని మేడికొండకు చెందిన మాధవి గురువారం మధ్యాహ్నం ఓటు వేసి కాన్పు కోసం అయిజకు వెళ్లాలని నిర్ణయించుకున్నది. అదే సమయంలో పురిటి నొప్పులు మొదలుకాగా.. కుటుంబసభ్యులు హుటాహుటిన పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించారు. అనంతరం 108లో అయిజ పీహెచ్‌సీకి తరలించగా.. డాక్టర్లు సాధారణ కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు, డాక్టర్లు సంతోషం వ్యక్తం చేశారు. -అయిజ

ఓటేసిన శతాధిక వృద్ధురాలు

104 ఏండ్ల వృద్ధురాలు ఓటు హక్కును వినియోగించుకొని.. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంత కీలకమో చాటిచెప్పింది. సిద్దిపేట పట్టణంలోని బారాయి మామ్‌కు చెందిన జోహరబీ (శతాధిక వృద్ధురాలు).. ఇంటి నుంచి నడుచుకుంటూ వచ్చి నాసర్‌పురా పోలింగ్ బూత్‌లో ఓటేసింది. ఓటును నిర్లక్ష్యం చేసే వారికి ఆదర్శంగా నిలిచింది. -సిద్దిపేట టౌన్

తొలిసారి ఓటేసిన జంట కవలలు

హనుమకొండ జిల్లా శాయంపేట మండంలోని గట్లకానిపర్తికి చెందిన రౌతు రమేశ్, సువర్ణ దంపతులకు నలుగురు కవల పిల్లలు.. రౌతు రాజ్‌దీప్, రౌతు రాహుల్, రౌతు రోహన్, రౌతు రోహిత్ ఉన్నారు. వారికి ఈ సారి కొత్తగా ఓటు రావడంతో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాలు పంచుకున్నారు. గట్లకానిపర్తిలోని పోలింగ్ బూత్‌లో నలుగురు కలిసి ఒకేసారి తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. -శాయంపేట



భువనగిరిలోని భగాయత్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

ఉత్సాహంగా కదిలిన కొత్త ఓటర్లు

- తరలివచ్చిన వృద్ధులు, దివ్యాంగులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాత్రి 9.30 వరకు కొనసాగిన పోలింగ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 30: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావడంతో అనేకచోట్ల ఓటర్లు అప్పటికే క్యూకట్టారు. మధ్యాహ్నం కొంత మందకొడిగా సాగిన ఆ తరువాత మళ్లీ ఓటింగ్ శాతం పుంజుకున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు పలుచోట్ల రాత్రి 9.30 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. వీరంతా సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకొని క్యూలో నిల్చోడంతో పోలింగ్‌కు అవకాశం కల్పించారు. చాలాచోట్ల కొత్త ఓటర్లు ఉత్సాహంగా కనిపించారు. ఓటు వేసి వచ్చి సిరా గుర్తు చూపుతూ ఫొటోలు దిగారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం భారీగా కదిలివచ్చారు. వీరి కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీల్‌చైర్లతోపాటు సహాయకులను అందుబాటులో ఉంచారు. సిద్దిపేట పట్టణంలోని బారాయిమామ్‌కు చెందిన 104 ఏండ్ల వృద్ధురాలు జోహరబీ ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్లి నాసర్‌పురా పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకొని పలువురికి ఆదర్శంగా నిలిచింది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం కిష్టంపేటలో నవ దంపతులు ఓటు వేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం మేడికొండకు చెందిన నిండు గర్భిణి మాధవికి మధ్యాహ్నం పురిటి నొప్పుల మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లగా ఓటు వేసింది. అనంతరం ఆమెను 108లో అయిజ పీహెచ్‌సీకి తరలించగా పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని గట్లకానిపర్తిలో జంట కవలలు తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఆవంచలో జక్కుల రాములు అనే వ్యక్తి మరణించగా, ఆయన కుమారుడు, సోదరుడు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో తమ ఓటు వేశారు.

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు